ప్రజాశక్తి
సోమవారం 10 నవంబర్ 2025
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి

కనీస వేతనం కోసం పోరాటాలు

సభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి, వేదికపై ఎవి.నాగేశ్వరరావు తదితరులు

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ పిలుపు
- చివరి రోజూ ఉత్సాహపూరితంగా చర్చలు
- 9 తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - అనకాపల్లి

కనీస వేతనం రూ.26 వేలు కోసం పోరాటాలను ఉధృతం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ పిలుపునిచ్చింది. రెండు రోజులపాటు అనకాపల్లిలోని కర్రి రమేష్ కల్యాణ మండపంలో నాగలక్ష్మి నగర్‌లో తలపెట్టిన సంఘం ఐదో రాష్ట్ర మహాసభ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి నివేదికపై అన్ని జిల్లాల నుంచీ చర్చల్లో పాల్గొన్నారు. ఈ మహాసభ ఆద్యంతం ఉద్యమ స్ఫూర్తితో కొనసాగింది. భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించింది.

ఆదివారం ప్రతినిధుల సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ పోరాటాల సమయంలో ప్రభుత్వం అంగీకరించిన అన్ని అంశాలపై వెంటనే జిఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలపై పనిభారం మోపరాదన్నారు. వివిధ జిల్లాల్లో ఆశాలపై రాజకీయ వేధింపులు ఎలా ఉన్నాయో ఆమె వివరించారు. అహర్నిశలూ కష్టపడుతున్న ఆశాలకు వేతనాలు, సౌకర్యాలు పెంచాల్సింది పోయి ప్రభుత్వాలు పెట్టుబడి దారుల సేవలో మునిగి తేలుతున్నాయని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల పని గంటల పెంపు మిగతా 2లో..

తీర్మానాలను ఆమోదిస్తున్న ప్రతినిధులు

వార్త మెయిన్‌లో..

జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఎపి

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మీడియాకు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం సిఐఐ పార్టనర్‌షిప్ ఏర్పాట్లలో ఉన్నందున పిజిఆర్ఎస్‌ను తాత్కాలింగా రద్దు చేసినట్టు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు దీన్ని గమనించాలని కోరారు. ఈ నెల 17న తిరిగి పిజిఆర్ఎస్ యధావిధిగా జరుగుతుందని తెలిపారు.

ఎంవిపి.కాలనీ : పోలీసు కాన్ఫరెన్స్ హాల్, జివిఎంసి కార్యాలయాల్లో సోమవారం జరగాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాలు రద్దయినట్టు అధికార యంత్రాంగం వెల్లడించింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు బైకిస్టుల దుర్మరణం

వార్త 3లో..

ఉక్కు రక్షణపై చిత్తశుద్ధి ఏదీ ?

వార్త 2లో..

బల్క్ డ్రగ్ ఏర్పాటుతో ఉనికికే ప్రమాదం

వార్త 8లో..

11న ఎపి లేబర్ సమ్మిట్

మేధావులు, అభ్యుదయవాదులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు హాజరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపి లేబర్ సమ్మిట్ - 2025 పేరిట మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగనుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్న నేపథ్యంలో కొన్ని ముఖ్యమైన అంశాలపై సదస్సులు నిర్వహించాలని ఆహ్వాన సంఘం భావించిందని, అందులో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి పారిశ్రామికవేత్తల పెట్టుబడుల సమ్మిట్‌కు ప్రత్యామ్నాయంగా ఈ నెల 11న సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎపి లేబర్ సమ్మిట్ - 2025 నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కెఎస్.చలం హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి మేధావులు, అభ్యుదయవాదులు, కార్మిక సంఘాల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. ప్రభుత్వం పారిశ్రామికాధిపతులకు పరిశ్రమల పేరిట కారు చౌకగా ప్రభుత్వ భూములు కట్టబెడుతోందని, కానీ పరిశ్రమలు రావడం లేదని, ఉపాధి లభించడం లేదని, సరి కదా ఉన్న ఉపాధినే కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో రెండు వేల మందిని, కాంట్రాక్ట్ కార్మికులను 5,500 మందిని తొలగించారన్నారు. విశాఖ డెయిరీలో 300 మందికి పైబడి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. ఇంకా అనేక ప్రభుత్వ రంగ సంస్థలలో రిటైర్ అయిన, చనిపోయిన పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఈ కాలంలో అనేక పెట్టుబడుల సమ్మిట్లు జరిగినా ఫలితం శూన్యంగానే ఉందన్నారు. మళ్లీ ఇప్పుడు పారిశ్రామిక సమ్మిట్ మిగతా 2లో..

భాగస్వామ్య సదస్సుకు ముస్తాబు

- నగరంలో సుమారు రూ.60 కోట్లతో సుందరీకరణ పనులు
- పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా సమ్మిట్ : అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యంలో జరగనున్న 30వ భాగస్వామ్య సమ్మిట్ - 2025 కోసం విశాఖ నగరం ముస్తాబవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సదస్సు ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరగనుంది. దీన్ని పురస్కరించుకుని భారీగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు నగర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి పలు చర్యలు చేపడుతున్నట్టు జివిఎంసి, జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

కూడళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన బొమ్మలు

పెట్టుబడుల అంచనాలు.. లక్ష్యాలు

ఈ రెండు రోజుల సదస్సు ద్వారా ఎపికి దాదాపు 9.8 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమ్మిట్‌లో సుమారు 410 అవగాహనా ఒప్పందాలపై సంతకాలు జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ రెండు రోజుల్లో రూ.2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుపుతామని అంటోంది. ముఖ్యంగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, ఎన్‌టిపిసి, బిపిసిఎల్, మిగతా 2లో..

సుందరంగా రూపుదిద్దుకున్న రహదారి

మొదటి పేజీ తరువాయి..

11న ఎపి లేబర్ సమ్మిట్

పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, లక్షల్లో ఉద్యోగాలు దక్కుతాయని ప్రజల్ని మభ్యపెట్టే విధంగా ప్రభుత్వ ప్రకటనలు ఉన్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితిని తెలిపేందుకు లేబర్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భాగస్వామ్య సదస్సుకు ముస్తాబు

రిలయన్స్, టిసిఎస్ వంటి అంతర్జాతీయ, దేశీయ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయని సర్కారు చెబుతోంది. బీచ్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న లూలూ మాల్‌కు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

సుందరీకరణ పనులకు భారీ వ్యయం

ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు విశాఖకు రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులను జివిఎంసి చేపట్టింది. సుమారు రూ.42 కోట్ల నుంచి రూ.60 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తున్నారు. ఇప్పటికే 212 అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అందులో ప్రధానంగా రహదారులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ప్రతినిధులు పర్యటించే అవకాశం ఉన్న 17 ప్రధాన రహదారులలో సుమారు 64 కిలోమీటర్ల మేర కొత్త తారు లేయర్లు వేయడం లేదా మరమ్మతులు చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు టైల్స్ మార్పు, డివైడర్లకు రంగులు వేయడం, సూచికల ఏర్పాటు, సిరిపురం, పార్క్ హోటల్ వంటి ప్రధాన కూడళ్లను ఆధునీకరించడం చేస్తున్నారు. నగరంలో పబ్లిక్ గోడలపై స్థానిక కళాకారులచే సుమారు రూ.74 లక్షల ఖర్చుతో కుడ్య చిత్రాలు వేయిస్తున్నారు. పచ్చదనాన్ని పెంచడానికి రూ.8.80 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంబడి విదేశీ మొక్కలు నాటుతున్నారు.

సమ్మిట్ వేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగే సదస్సు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ప్రాంగణానికి మూడు వైపులా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్య అతిథుల కోసం మూడు హెలిప్యాడ్‌లు సిద్ధం చేశారు. 1100 కార్లు నిలిపే సామర్థ్యంగల పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

'జీరో వేస్ట్' ఈవెంట్

దేశంలోనే మొట్టమొదటి 'సర్టిఫైడ్ జీరో వేస్ట్' ఈవెంట్‌గా ఈ సమ్మిట్‌ను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈవెంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వ్యర్థాలను వంద శాతం రీసైకిల్ చేసి, తిరిగి ఉపయోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాల్గొనే అతిథులు

సుమారు 3 వేల మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్న ఈ సదస్సులో 40కిపైగా దేశాల నుండి ప్రతినిధులు, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. 13 మంది కేంద్ర మంత్రులు, 29 దేశాల వాణిజ్య మంత్రులు రానున్నారు. 80 మంది అంతర్జాతీయ సిఇఒలతో సహా పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ లీడర్లు హాజరుకానున్నారని అధికారులు తెలిపారు.

కనీస వేతనం కోసం పోరాటాలు

నిర్ణయం అత్యంత దుర్మార్గమైనదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. మహాసభలో వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డి.డి.వరలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె.పోశమ్మ, పి ధనశ్రీ, వి.సత్యవతి, డి.సుధారాణి, పి.మణి, డి.జ్యోతి, కమల, అమర, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మికులకు నష్టం చేకూర్చేలా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, సిహెచ్‌డబ్ల్యులకు ఆశా వర్కర్లతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 9 తీర్మానాలను ఈ మహాసభ ఆమోదించింది. రెండు రోజులపాటు సాగిన ఈ మహాసభలో ఆశా కార్యకర్తలు ప్రదర్శించిన కోలాటం సహా సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సన్‌ఫీస్ట్ ఫెంటాస్టిక్ నుండి నూతన ఉత్పత్తులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఐటిసి ఫుడ్స్ డివిజన్, సన్‌ఫీస్ట్ ఫెంటాస్టిక్ శ్రేణిలో భాగంగా 'చాకోమెల్ట్' అనే నూతన ఉత్పత్తిని మార్కెట్లోకి ఆదివారం విశాఖలో విడుదల చేసింది. ఈ స్పెజుబుల్ (నొక్కబడే), రిచ్ అండ్ స్మూత్ మెల్టన్ చాకోను కేవలం రూ.5 ధరలో అనుకూలమైన ప్యాకేజింగ్‌లో అందిస్తున్నామని ఐటిసి ఫుడ్స్ డివిజన్ మార్కెటింగ్ హెడ్ అనుజ్‌బన్సల్ తెలిపారు.

ఆదివారం బీచ్ రోడ్‌లోని ఐటిసి వెల్కమ్ గ్రాండ్‌బే హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చాకోమెల్ట్ అనేది చాక్లెట్‌ను బార్ లేదా బైట్‌గా కాకుండా, విలక్షణమైన అనుభూతిని ఇచ్చే ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి అని తెలిపారు. దీనిని ప్యాక్ నుండి నేరుగా తాగవచ్చు, లేదా బ్రౌనీస్, పరాఠా, టోస్ట్, ఐస్‌క్రీంలు పండ్లపై రాసి, పోసి ఆస్వాదించవచ్చునని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో జూన్ 1, 2025 నుండి లభిస్తోందని దీనిని ఆంధ్రప్రదేశ్‌లో నేడు విడుదల చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంస్థ క్రియేటివ్ డైరెక్టర్ సుచిత్రా గెహ్లాట్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణపై చిత్తశుద్ధి ఏదీ ?

దీక్షల్లో కూర్చున్న ప్రభుత్వ రంగ పరిశ్రమల కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదని, షిప్‌యార్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీరందాసు ప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 1668వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్ఇఎల్, హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లకు చెందిన సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, ఇంకా నిర్మాణం కూడా కాని ఆర్సీ మిట్టల్‌స్టీల్ కోసం సొంతగనులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ రంగ విశాఖస్టీల్‌పై కూటమి ప్రభుత్వానికి లేకపోవడం ఆశ్చర్యంతో పాటు, ప్రభుత్వరంగం పట్ల వీరి చిత్తశుద్ధిని సంశయించేలా ఉందని అన్నారు. బిహెచ్ఇఎల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జి.టి.పి ప్రకాష్ మాట్లాడుతూ,స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. నాటి బిహెచ్‌పివిని కూడా ప్రైవేటీకరించాలని కేంద్రం ప్రయత్నించిందని కార్మికులు చేసిన పోరాటం ఫలించి యుపిఎ 1 ప్రభుత్వ కాలంలో వామపక్షాల సహకారంతో కాపాడుకున్నామన్నారు. స్టీల్ పోరాటానికి బిహెచ్ఇఎల్ కార్మికుల మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈరోజు దీక్షల్లో కందుల నారపురెడ్డి, అప్పలనారాయణ ఆల్సి, షిప్ యార్డ్ నాయకులు బిఎస్ఎన్ రాజు,పొన్నా శివరాం, అచ్చిన్నాయుడు, నారపురెడ్డి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిట్ పనుల్లో మరింత వేగం పెంచాలి

ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దీత సమయం కంటే ముందుగానే పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన వేదిక, స్వాగత ద్వారాలు, అతిథుల రాక, పార్కింగ్ వసతి తదితర అంశాలపై సూక్ష్మ స్థాయి పరిశీలన చేసి పలు ప్రాంతాల్లో ఇంకా చేయాల్సిన పనులపై అధికారులను అప్రమత్తం చేశారు. జివిఎంసి సిఇకి పలు అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై, మార్పులు చేర్పులపై ఆదేశాలు జారీ చేశారు. డిసిపి మణికంఠ చందోలు, జివిఎంసి సత్యనారాయణరాజు, సిఎంఒ నరేష్ కుమార్, సిఐఐ ప్రతినిధి మౌళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శబరిమలైకి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం నుండి శబరిమలై భక్తులు కొరకు ప్యాకేజ్‌తో స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. పంచారామాలకి నిర్వహించిన బస్సులకు మంచి స్పందన లభించినదని, అదేవిధంగా శబరిమలైకి కూడా మంచి స్పందన ఉందన్నారు. అదేవిధంగా సత్య సాయిబాబా జన్మదిన ఉత్సవాల సందర్భంగా ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు 100 సంవత్సరాల పుట్టినరోజు ఉత్సవాలు జరుపుతున్నారని, ఈ సందర్భంగా స్పెషల్‌బస్సులు డిమాండ్ తగ్గట్టుగా విశాఖపట్నం నుండి నడపబడునని కావలసినవారు ద్వారకా బస్‌స్టేషన్ ఎపిఎస్‌ఆర్టీసి కాంప్లెక్స్ లో, 9959225602 నెంబర్ తో సంప్రదించవచ్చన్నారు,శ్రీ సత్య సాయి బాబా అనంతపూర్ జిల్లా పుట్టపర్తికి బస్సులు వివిధ ప్రాంతాల నుండి ఎపిఎస్‌ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నారని తెలిపారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి - అనంతగిరి: మండలంలోని బీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు జేష్ట .వెంకటరమణ డిమాండ్ చేశారు. సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం గ్రామంలో సందర్శించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ట్యాంకు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న బోరు, మోటార్ కనెక్షన్ పైప్ లైన్ మరమ్మతు గుర్తి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవన్నారు. దీంతో గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న చెలమ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే బోరు మోటార్ కనెక్షన్ మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు మిర్యాల .అప్పల స్వామి, గెమ్మెల లక్ష్మణరావు, ముత్యాలు, శ్రీదేవి. తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సామరస్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: భారత వారసత్వం - సామరస్యం నినాదంతో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఎఐ) ఆంధ్ర ప్రదేశ్ శాఖ చేపట్టిన అంతర్ రాష్ట్ర అవగాహన యాత్ర ఆదివారం విశాఖలో మొదలైంది. వైహెచ్ఎఐ ముఖ్య పోషకులు, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ సి. హెచ్ శ్రీనివాస్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ సి. హెచ్.రవిపాల్, గౌరవకార్యదర్శి ఎ.డి.ఇబ్రహీం, కోశాధికారి శ్రీనివాసరావు, పూర్వ చైర్మన్ ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.వి.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇబ్రహీం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో సాగే ఈ యాత్రలో,చారిత్రక దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలను సందర్శిస్తారన్నారు. విశాఖపట్నంలో సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, ఋషికొండ టిటిడి బాలాజీ ఆలయం, శ్రీకాకుళం అరసవల్లి సూర్య నారాయణమూర్తి,శ్రీ కూర్మనాథ ఆలయాలు, శ్రీముఖలింగం మీదుగా ఈ బృందం ఒడిశాలోని చిలకా చేరుకుంటుందన్నారు. చిలకాలో రాత్రికి బస చేసి మరుసటి రోజు సరస్సులోని కాళీమాత ఆలయాన్ని దర్శిస్తుందని, అక్కడి నుండి పూరి క్షేత్రానికి చేరుకుని,పూరి జగన్నాథ స్వామి దర్శనం అనంతరం కోణార్క్ వెళ్తుందన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -మధురవాడ : గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది విజ్ఞప్తిచేశారు. మధురవాడ శిల్పారామంలో ఆదివారం 104 ఉద్యోగుల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 104 ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అరబిందో నుండి రావాల్సిన బకాయిలు గ్రాట్యూటీ, ఎర్న్డ్ లీవ్‌ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఈ బకాయిలు ఇప్పించాలని కోరారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ యాజమాన్యం కూడా ఉద్యోగుల సంక్షేమం ఏమాత్రం పట్టించుకోకుండా నిబంధనలను పట్టించుకోకుండా తీవ్రమైన ఒత్తిడి పెట్టి పనిచేయిస్తోందని ఆరోపించారు. ఇప్పటివరకు నియామక పత్రాలు, పేస్లిప్పులు ఉద్యోగులకు అందచేయలేదని చెప్పారు. పూర్తి స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టి బఫర్ సిబ్బందిని ఆర్ఎఫ్‌పి నిబంధనలు ప్రకారం నియమించి ఉద్యోగుల మీద అదనపు భారం తగ్గించాలని, 104లో ఫార్మాసిస్ట్‌ను నియమించాలని, అప్పటివరకు డిఇఒలకు డ్రగ్స్ నిర్వహణ బాధ్యతలు తప్పించాలని కోరారు. 2020 తరువాత జాయిన్ అయిన వారికి జీతాల పెంపు లేనందున గత ఐదున్నర సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, అందరికీ ప్రస్తుత అవుట్ సోర్సింగ్ జిఒ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఇఒలకు రూ.18,500 జీతం ఇవ్వాలని, ఉద్యోగులకు క్యాజువల్ లీవులు అమలు చెయ్యాలని, పిఎఫ్, ఈఎస్ఐలో విధించిన కోతలు సరిచేయాలని, యాజమాన్యం వాటా చెల్లించాలని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు ఇప్పించాలని, డిఇఒలకు పని భారం తగ్గించాలని, వాటర్ క్లోరిన్, డ్రగ్ రికార్డులు నిర్వహణ లాంటి పనులు అప్పగించకూడదని, వెహికిల్ ఇన్సూరెన్స్, ఫిటినెస్‌లు వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, అప్పలరాజు, భవ్య, తాతబాబు, కాశిం, జ్యోతి జ్ఞానేశ్వరరావు, అర్జున్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని వేములవలస సర్వీస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేములవలస ఎస్‌సి, బిసి కాలనీలో నివసిస్తున్న ఉప్పాడ అప్పలరాము (45) మతిచెందాడు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు అప్పలరాము శనివారం రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు మోకాలు, నడుము భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో బాధితుడిని కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మరణించాడు. మృతుని కుమార్తె భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఒక యువతి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. దీనికి సంబంధించి గాజువాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.పార్థసారథి కథనం ప్రకారం... ఎస్.రాయవరానికి చెందిన భవాని, యలమంచిలికి చెందిన స్వామి ఏడాది క్రితం ప్రేమించుకున్నారు. ప్రస్తుతం స్వామి పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఆదివారం గాజువాకలో ఉంటున్న యువతి పోలీసుస్టేషన్‌కు వెళ్లి నెయిల్ రిమూవర్ తాగింది. పోలీసులు వెంటనే ఆర్కె హాస్పిటల్‌కు తరలించారు.

ఈ ప్రేమికులకు గతంలో కూడా రెండుసార్లు కౌన్సిలింగ్ చేశానని సిఐ పార్థసారధి తెలిపారు. అబ్బాయి పెళ్లికి నిరాకరిస్తున్నాడని, అమ్మాయి కేసు వద్దని, ఏదో విధంగా పెళ్లిచేయాలని కోరడంతో కేసు నమోదు చేయలేదని చెప్పారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు బైకిస్టుల దుర్మరణం

ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో వేర్వేరు చోట్ల జరిగిన మూడు బైక్ ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో రెండుచోట్ల రెండు బైక్ ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు స్థానిక ఎస్ ఐ విభూషణరావు తెలిపారు. ఆదివారం ఎస్ఐ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలివి. శనివారం రాత్రి 9.30 గంటలకు ఎస్.రాయవరం గ్రామానికి చెందిన గింజాల హరీష్ అనే యువకుడు రాయవరం నుండి లింగరాజుపాలెం పొలంలోకి బైక్‌పై వెళుతుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్ తరలిస్తుండగా మార్గ మధ్యలో యువకుడు మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు .

మండలం గోకులపాడు వాటర్ ప్లాంట్ వద్ద జాతీయ రహదారిపై వెళుతున్న బైకును లారీ ఢీకొట్టడంతో అక్కడిక అక్కడే ఒక యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ ఐ విభూషణరావు తెలిపారు.ఆదివారం సాయంత్రం తుని మండలం తలుపులమ్మలోవకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు ఎలమంచిలి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన ఊడి రంజిత్‌గా గుర్తించారు. గాయపడిన వారిని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించిసేవలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

పాయకరావుపేటలో ఒకరు...

పాయకరావుపేట : మండలంలోని నామవరం పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. : పాయకరావుపేట నుండి నామవరం వైపు బైక్‌పై వెళ్తున్న షేక్ హుస్సేన్, నామవరం పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి పెట్రోలు బంకు లోపల నుంచి జాతీయ రహదారిపైకి హారన్ వేయకుండా వస్తున్న లారీని ఆఖరి క్షణంలో గమనించి, బైక్‌ను అదుపు చేయలేక లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, హారన్ కొట్టకుండా రోడ్డుపైకెక్కడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి నక్కపల్లి సిహెచ్‌సికి తరలించి, అనంతరం బంధువులకు అప్పగించారు. ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామని, లారీని సీజ్ చేసినట్టు సిఐ జి అప్పన్న తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : షీలా నగర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందారు. ఘటన స్థలానికి గాజువాక పోలీసులు చేరుకొని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి,-యలమంచిలి టౌన్ :యలమంచిలి పట్టణంలోని తులసి థియేటర్ రోడ్‌లో నివాసముంటున్న చెక్క గౌరీపార్వతి అనే యువతి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ సావిత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ పట్టభద్రురాలైన గౌరీపార్వతి స్థానిక రంగవారివీధిలోని బిఎస్.బంగారుసెట్టి చార్టెడ్ అకౌంటెంట్ ఆఫీస్‌లో 45 రోజులుగా పనిచేస్తోంది. శనివారం ఎప్పటిలాగానే విధుల్లోకి వెళ్లి, రాత్రి 7.40 గంటలకు తన తండ్రి సన్యాసిరాజుకు కాల్ చేసి ఇప్పుడే ఇంటికి బయలుదేరుతున్నానని చెప్పింది. అయితే ఆమె ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి పలుచోట్ల వాకబు చేసినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై టౌన్ ఎస్ఐ సావిత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫైబర్ బోటు బోల్తా - మత్స్యకారునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం ఎదురుగా ఉప్పుటేరుకు అనుకుని సముద్రంలో ఆదివారం తెల్ల వారు జామున ఫైబర్ బోల్తా పడింది. బాధిత మత్స్యకారుల కథనం ప్రకారం... జివిఎంసి మూడో వార్డు ఎగువపేటకు చెందిన మత్స్యకారుడు అమ్మోరు, మరో నలుగురు సముద్రంలో వేటకు వెళ్లారు. ఒడ్డుకు చేరుకునే క్రమంలో కెరటాల ఉధృతి కారణంగా బోటు బోల్తా పడింది. బోటులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. వీరిలో పి.అమ్మోరు (28) గల్లంతవ్వగా తోటి మత్స్యకారులు గాలించి అతన్ని ఒడ్డుకు చేర్చి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆసుపత్రికి వెళ్లి అమ్మోరు ఆరోగ్య పరిస్థితిని వైద్యులనడిగి తెలుసుకున్నారు.

సామాజిక భవనం మంజూరుకు వినతి

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి ఎన్‌టిఆర్.కాలనీలో సామాజిక భవనం మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆదివారం నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉన్న అతని నివాసంలో వినతి పత్రం అందజేశారు. స్థానిక కాలనీ వాసుల శుభకార్యాల నిర్వహణకు సామాజిక భవనం ఏర్పాటు అవసరమని వినతిలో పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నూకరాజు తెలిపారు. ఎమ్మెల్యే గంటాను కలిసిన వారిలో స్థానిక కాలనీ వాసులు వేణు, పి.అప్పారావు, శ్రీను, వీరుబాబు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిరు వర్తకులకు రక్షణ కల్పించాలి

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్

ప్రజాశక్తి-మధురవాడ : చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవించే వర్తకులకు చట్ట ప్రకారం రక్షణ కల్పించాలని సిఐటియు నాయకుడు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ డిమాండ్ చేశారు. పిఎం.పాలెంలోని శ్రీ ఆంజనేయ చిరు వర్తకులు, తోపుడు బండ్లు సంఘం సమావేశం ఆదివారం ఏర్పాటుచేశారు. ముందుగా సిఐటియు జెండాను సంఘం అధ్యక్షుడు వై.ధనుర్ ఆవిష్కరించారు. కార్యదర్శి డి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ మాట్లాడుతూ, చిరు వ్యాపారుల హక్కులను హరించి, జీవన భృతిని దెబ్బ తీస్తే పోరాటాలతో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్నాయని, అందరూ హాజరై జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రిటైల్ మార్కెటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖ నగరంలోని సెయింట్ ఆంథోనీ పబ్లిక్ స్కూల్ జరిగిన జిల్లా స్థాయి రిటైల్ మార్కెటింగ్, ఐటి నైపుణ్య పోటీల్లో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రిటైల్ మార్కెటింగ్‌లో 9వ తరగతి విద్యార్థులు సిహెచ్.నీలిమ, సిహెచ్.ఉజ్వలశాంతి, జి.శైలజ, ఎల్.హేమ ప్రథమ స్థానంలో నిలిచారు. ఐటి విభాగంలో 9వ తరగతి విద్యార్థులు బి.లిఖిత, ఆర్.శ్రావ్య, ఎంహర్షవర్ధన సాయి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు ఎంపికయ్యారని వృత్తి విద్యా శిక్షకులు వి.చాందిని, చిన్నబాబు తెలిపారు, ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు జిసిడిఇ, ఎపిసి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అవంతిలో వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల, ఎపిసిటి సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ భాషల్లో హైడ్రజన్ ఎనర్జీ అవగాహన, ఆవిష్కరణలపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ ఆదివారం ప్రారంభించారు. వరంగల్ ఎన్ఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగశ్రీనివాసులు, ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ హైడ్రోజన్ ఎనర్జీ సిస్టమ్ ఫ్యూయల్ సెల్ గురించి వివరించారు. ఈ సదస్సును తెలుగు భాషలో నిర్వహించారు. సాంకేతిక విజ్ఞానాన్ని భారతీయ భాషల్లో ప్రోత్సహించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమములో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి- ఆనందపురం : హక్కుల కోసం భవన నిర్మాణ, పంచాయతీ కార్మికులు సంఘటితంగా పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. చిట్టివలస లేబర్ యూనియన్ ఆధ్వర్యాన ఆదివారం వెల్లంకి గ్రామంలో భవన నిర్మాణ, పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు కార్మికుల జీవనాధారంపై దెబ్బతీస్తున్నాయన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోసం విశాఖ పౌర గ్రంథాలయంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సులకు కార్మికులు హాజరుకావాలని కోరారు. 15 గంటలపాటు పని చేసే వ్యవస్థను రద్దుచేయాలని, కార్మికులకు న్యాయమైన వేతనాలు, భద్రతా చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లేబర్ యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, రాంపైడి, సిపిఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరం కిటకిట

ప్రజాశక్తి- భీమునిపట్నం : అసలే ఆదివారం.. ఆపై కార్తీక మాసం.. దీంతో స్థానిక సాగర తీరం పర్యాటకులు, సందర్శకులతో కిటకిట లాడింది. సాగర కన్య విగ్రహం వద్ద సందర్శకులు సముద్రంలో కేరింతలు కొట్టారు. లైట్ హౌస్‌ను సందర్శించి అక్కడే ఉన్న పార్కులో పిల్లలు సరదాగా గడిపారు. సందర్శకులతో పలు పార్కులు సందడిగా కనిపించాయి.

మల్లకంభ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- ఆనందపురం : గుంటూరు జిల్లా వెనిగండ్ల ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ మల్లకంభ పోటీల్లో గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 14 సంవత్సరాల బాలురు, బాలికల విభాగంలో నలుగురు, 17 సంవత్సరాల బాలురు, బాలికల విభాగంలో ఏడుగురు, 19 సంవత్సరాల బాలుర విభాగంలో ఇద్దరు అర్హత సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24 నుండి 27 వరకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరగనున్న జాతీయ స్థాయి మల్లకంభ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-తగరపువలస : సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆదర్శనగర్ ప్రాంతంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహాసభల విజయవంతానికి ప్రజలు సహకారం అందించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీలో డిసెంబరు 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు మహాసభలు జరుగుతాయని, ప్రజలందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంపాన సూర్యనారాయణ, ముద్దాడ రాము, చల్ల అప్పారావు, జీర అప్పలరెడ్డి, జి.రామ్‌రెడ్డి, బి.త్రినాథ్, కర్రి రాము, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

విరాళం అందజేత

ప్రజాశక్తి -ములగాడ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభలకు జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీకి చెందిన మురహరిరావు లక్ష్మీకాంతం ఆదివారం రూ.50 వేలు విరాళాన్ని సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, నాయకులు ఎ.సత్యారావు, కె.పెంటారావు, పి.పైడిరాజుకు అందించారు. లక్ష్మీకాంతానికి సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, లక్ష్మీకాంతం కమ్యూనిటీ హెల్త్ వాలంటరీగా (సిహెచ్‌వి)గా పనిచేసేవారని తెలిపారు. ఎకెసి, ఆంధ్ర స్టీల్ కాలనీలో ప్రజలకు వైద్యసేవలందించేవారని తెలిపారు. ఆమె అప్పట్లో సిఐటియులో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని చెప్పారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా కాలనీ ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఐద్వాలో పనిచేస్తున్నారని చెప్పారు.

సిఐటియు నాయకులకు విరాళం అందిస్తున్న కాంతమ్మ

'పావనమూర్తి సేవలు మరువలేనివి'

ప్రజాశక్తి-సీతమ్మధార : చింతకాయల పావనమూర్తి సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన ప్రముఖ అంబేద్కర్‌వాది పావన మూర్తి సంస్మరణ సభను బుద్దిస్ట్ సంప్రదాయంలో ఆదివారం రామా టాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. బౌద్ధ భిక్షువు మిత్యానంద బాంతేజీ (ఒడిశా) బౌద్ధ పంచశీలను ఉచ్చరించారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ జివి.హర్షకుమార్, ఐపిఎస్ అధికారి మోక సత్తిబాబు తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ సిద్ధాంతాలను పావనమూర్తి వాడ వాడలా తీసుకెళ్లారన్నారు. అంబేద్కర్ సామాజిక భవనాలు, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు వెనుక ఆయన కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. మానవులందరూ సమానమని చాటి చెప్పిన బౌద్ధ ధర్మాన్ని అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన స్వీకరించడంతోపాటు వేలాదిమందిచే స్వీకరింపజేశారని చెప్పారు. ఎయు ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న క్రమంలో అనేకమంది విద్యార్థులు పరిశోధకులకు ఆయన స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు సి.ప్రజ్ఞ, భీంజీ, రాంజీ, అంబేద్కర్, జెవి.ప్రభాకర్, మల్లయ్యరాజు, పెయ్యల పావన ప్రసాద్, పరువు రాజేశ్వరరావు, కె.చిన్నారావు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పాక సత్యనారాయణ పాల్గొన్నారు.

నవ్వులు పండించిన కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా నిర్వహించే 'వినోదాల విందు'లో భాగంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం కామెడీ షో నిర్వహించారు. కుక్కర్, రెండు కోరికలు, సూపర్ మార్కెట్, ఆవకాయ కంపెనీ, గెదె పాలు, లవంగం, డాక్టర్ పేషెంట్, ప్రమోషన్, బద్ధకం, చెప్పులు ఎంత, న్యూస్ రీడర్ స్కిట్స్‌ను కళాకారులు ప్రదర్శించి నవ్వులు పండించారు. నాయుడుతోటలోని వాగ్దేవి నృత్యాలయం గురువు సౌందర్య సురేష్, శిష్యులు నేహ నాయక్, గిరిస్మాశ్రీ, దీక్షశ్రీ, మౌనిక, యాసిన్సీ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం అతిథులు తిలక్ పట్నాయక్, జీవన్‌బాబు, ఆర్‌వి.రమణ, బి.నాగరాజారావు చేతుల మీదుగా కళాకారులకు మెమెంటో, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, ఆర్‌వి.రమణ, రాగన్‌నాయుడు, గిరిజ, హాస్య ప్రియులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళ శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

భక్తులతో కిటకిటలాడిన సింహాద్రి

ప్రజాశక్తి- వేపగుంట : కార్తీకమాసం ఆదివారం సెలవు కావడంతో సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అప్పన్న దర్శనాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు సమర్థవంతంగా నడిచేలా ఇంజినీరింగ్ విభాగానికి తగిన సూచనలు జారీ చేశారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి : గంటా

ప్రజాశక్తి- ఆనందపురం : యువత స్వయం శక్తితో ఎదిగి విజయాలు సాధించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. ఆనందపురం మండలం వేములవలస కూడలిలో ఏర్పాటుచేసిన ధనలక్ష్మి డిజిటల్ జోన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకప్పుడు సాదాసీదాగా ఫొటో స్టూడియో వ్యాపారంలో దిగిన డిజిటల్ జోన్ అధినేతలు రెడ్డి రామలక్ష్మణులు వ్యక్తిగత శ్రమతో ఈ స్థాయికి ఎదగటం గర్వకారణమన్నారు. వీరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిఆర్‌బి.నాయుడు, తాట్రాజు అప్పారావు, కాకర వెంకటరమణ, బలిరెడ్డి చంటి, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కోరాడ రాము పాల్గొన్నారు.

బాల్యం కేంద్రాల్లో ఆటపాటలతో విద్య

ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న సీతారాం

ప్రజాశక్తి-సీతమ్మధార : బాల్యం కేంద్రాల్లో ఆటపాటలతో విద్యనభ్యసించే పిల్లలను ఉజ్వల భవిష్యత్తుకు సోపానాలుగా నిలిపేలా ఉపాధ్యాయులు అడుగులు వేయాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, జివిఎంసి ప్రైమరీ పాఠశాలలో జివిఎంసి బాల్యం ప్రాజెక్ట్ సారథ్యాన ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొండు సీతారాం హాజరై మాట్లాడుతూ, పిల్లలకు ఎంతో ఉపయుక్తంగా ఉండాలన్న సంకల్పంతో పెదబాల శిక్షలోని ఎనిమిది పర్వాలను ప్రామాణికంగా తీసుకొని పుస్తకాన్ని రూపొందించడం హర్షణీయమన్నారు. 30 బాల్యం కేంద్రాల్లో బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, అదనపు కమిషనర్ (ఫైనాన్స్)ఎస్.ఎస్.వర్మతో పాటు బాల్యం ప్రాజెక్ట్ అధికారి హెచ్.శంకరరావు, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్ ప్రత్యేక దృష్టి సారిస్తుండడం అభినందనీయమన్నారు, ఈ పథకం మరిన్ని రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం సదస్సుకు హాజరైన ఉపాధ్యాయులకు, సూపర్‌వైజర్లకు సీతారాం, బాల్యం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్, తెలుగు పండిట్ హైమవతి ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

విరాళం అందిస్తున్న నరసింహారావు

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆసుపత్రిని జిల్లా విశ్రాంత న్యాయమూర్తి సలాది నరసింహారావు రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. ఆసుపత్రిని సందర్శించి తండ్రి సలాది గంగరాజు జ్ఞాపకార్థం హాస్పిటల్‌లో అల్ట్రా సౌండ్ కలర్ డాప్లర్ గది ఆధునీకరణ కోసం ఈ విరాళాన్ని చెక్కు రూపంలో లయన్స్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావుకు అందజేశారు. సమాజంలోని అన్ని రకాల రోగులకు వైద్య సహాయం చేయడంలో హాస్పిటల్ చేస్తున్న కృషిని నరసింహారావు ప్రశంసించారు.

ముస్లిముల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి- గాజువాక : ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 70వ వార్డు పరిధి ఎల్‌వి.నగర్‌లోని నూర్ ఈ ఇస్లాం మసీదులో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పల్లాను ముస్లిం పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లో ముస్లిములకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మసీదు ముందు ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడమే కాకుండా, దీని పక్కనే షియా ముస్లిముల మసీదు నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఖురాన్ పఠనం అనంతరం గ్యార్వీ షరీఫ్ గొప్పతనాన్ని ముఫ్తీ మహమ్మద్ జాఫర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ రెహమాన్, వార్డు నేతలు చట్టి గోపి, కొయిలాడ శంకరరావు, గోమాడ వాసు, ఆఫీజ్ రెహమాన్, మహమ్మద్ భాషా, సిలార్ బాబా, మహమ్మద్ భాయ్, రహీం, ముస్తఫా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్‌లో శృతిక ప్రతిభ

ప్రజాశక్తి- ఆనందపురం : శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) అథ్లెటిక్స్ పోటీలలో ఆనందపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని రేగాని శృతిక రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తరపున 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్ పోటీలలో పాల్గొన్నారు. 400 మీటర్ల రేసులో ద్వితీయ స్థానం (సిల్వర్ మెడల్) సాధించినట్లు పాఠశాల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. శృతికను ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్ కోరాడ గౌరి, సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు, ఎంపిటిసి బోని అప్పలనాయుడు, బూర్ల వెంకటరమణ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బోయిపాలెం విద్యార్థులు

ఆనందపురం : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల్లో ఆనందపురం మండలం బోయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో అసనాల ఇనోష్ (అండర్-17), బాలికల విభాగంలో ఎస్.యోజిత (అండర్-14), సాఫ్ట్‌బాల్ అండర్-17 విభాగంలో టి.అన్వీషా ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు ఒఎస్‌ఎల్ భవాని తెలిపారు. వీరు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ చల్లా రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఐవి.కొండబాబు అభినందించారు.

14న పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయం సమీపంలో ఉన్న సరస్వతీ సమాజ భవనం ఆవరణలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు పింఛనుదారుల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పింఛనుదారుల సంఘం భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు తెలిపారు. సమావేశంలో మూడేళ్ల కాలపరిమితితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన సంఘ సభ్యులు హాజరు కావాలని కోరారు.

శేషుగెడ్డపై కొత్త వంతెన సాకారమయ్యేనా?

చినుకురాలితే వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నశేషుగెడ్డ (ఫైల్‌ఫొటో)

- చినుకు రాలితే రాకపోకలకు అగచాట్లు
- ప్రమాదకరంగా ఉన్న పాత వంతెన
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లేని స్పందన
- ఆందోళన చెందుతున్న ఎలమంచిలి వాసులు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి నుంచి అనకాపల్లి వెళ్లే పాత జాతీయ రహదారిలో యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర శేషుగెడ్డ వాగుపై కొత్త వంతెన నిర్మాణం కలగానే మిగిలి పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా శేషుగెడ్డ ఉప్పొంగడం, గెడ్డనీరు రోడ్డుపైకెక్కి రాకపోకలకు ఇబ్బందులు కలగడం నిత్యకృత్యంగా మారిందని, అయినా అధికారులు, నేతలెవరూ సమస్య పరిష్కారానికి చర్యలు చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు.

శేషుగెడ్డపై రాకపోకలకు వీలుగా ఏనాడో కట్టిన చిన్న వంతెన ఉంది. అయితే ప్రస్తుత వాహన రాకపోకలు, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా అది ఏమాత్రం సరిపోవడం లేదని స్థానికులు అంటున్నారు. తుపాను, భారీ వర్షాలు, ముసుర్లు పక్కన పెడితే, పట్టణంలో పట్టుమని అరగంటసేపు వర్షం పడితే ఇక్కడ రోడ్డుపై గంట, రెండు గంటలపాటు నీరు పారుతుంది. ఆ సమయంలో రోడ్‌పై మనుషులు, వాహనాలు కూడా నడవటానికి అవకాశం లేని పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయని స్థానికులు అంటున్నారు. వర్షంకురిసి, నీరు రోడ్డుపైకొచ్చే సరికి స్థానిక మున్సిపల్ అధికారులు, పోలీసులు అదనపు పని తప్పడం లేదు. హెచ్చరిక బోర్డులు పట్టుకుని అక్కడకు వెళ్లి, రోడ్డుపైనున్న నీరు పూర్తిగా తగ్గేవరకు అక్కడే వేచియుండి అటుగా వాహన రాకపోకలు సాగకుండా నియంత్రి స్తున్నారు. అంతేకాకుండా రహదారిపై వాహనాలను పూర్తిగా ఆపేసి, వాటిని బైపాస్ రోడ్‌కు డైవర్ట్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా ప్రస్తుతమున్న వంతెన

శేషుగెడ్డపై ప్రస్తుతమున్న వంతెన చిన్నగా ఉండడంతోపాటు ప్రమాదకరంగా ఉంది. కనీసం రక్షణ గోడ సైతం లేదు. దీంతో వర్షం లేని సమయంలోనూ ఈ వంతెన ప్రయాణం ప్రమాదకరమేనని స్థానికులు అంటున్నారు. వంతెనకు రెండువైపులా చిన్న కర్రలతో కట్టిన రక్షణ రిబ్బన్, ఒక చిన్న అట్టపై రాసిన పెట్టి ప్రమాద హెచ్చరిక బోర్డు ఏళ్లతరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోందని యలమంచిలి పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ వంతెన చిన్నదిగా ఉండడం, ప్రమాదకరంగా ఉండడంతో పరిమితంగా కొన్ని బస్సులు మాత్రమే పట్టణంలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వర్షం పడితే మున్సిపల్, పోలీసు సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు

ఏళ్ల తరబడి మొరపెట్టుకున్నా..

శేషుగెడ్డపై నెలకొన్న ప్రమాదకర, ఇబ్బందికర ప్రమాద పరిస్థితులపై అధికారులు, నేతలకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా, ఏళ్లు గడుస్తున్నా శేషుగెడ్డ వద్ద వంతెన సమస్యకు నేటికీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం వాటిల్లకముందే శేషుగెడ్డపై నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని వేడుకుంటున్నారు. హామీలకే పరిమితమౌతున్న శేషుగెడ్డపై నూతన వంతెన నిర్మాణాన్ని సాకారం చేయాలని కోరుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

శేషుగెడ్డ వద్ద వంతెన సమస్యపై ఆర్‌అండ్‌బి డిఇఇ ఎన్.నరసింహమూర్తి వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా, ఇక్కడ పరిస్థితులను వివరిస్తూ, కొత్త వంతెన నిర్మాణ ఆవశ్యకతతను తెలియజేస్తూ ప్రతిపాదనలు పంపుతున్నా మని తెలిపారు. పైనుంచి తమకు ఎటువంటి సూచనలు, ఆదేశాలు రాలేదన్నారు. వస్తే దానికి అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

రక్తదాన శిబిరాలకు స్పందన



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : మండలంలోని వెంకన్నపాలెంలో ఉరుకుటి పెదరామనాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. వైద్యశిబిరాలను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు ప్రారంభించారు. పలువురికి కంటి పరీక్షలతోపాటు అనేకమందికి ఉచిత ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తదాన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కనిశెట్టి సన్యాసిరావు , గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, ఎంపిటిసి రమణ, కొట్టాపు చిన్న గుమ్మాల సత్తిబాబు, గోవింద మాస్టారు, నేమాల పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో సిఆర్‌పిఎఫ్ జవాను గొర్లి శంకర్ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సర్పంచ్ పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో పాత గాజువాక, చినగంట్యాడ వందేభారత్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని 47 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాపుశెట్టి వెంకట్, పందిరిపల్లి రాము, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు

బ్రాండిక్స్ ఆధ్వర్యాన కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 144వ ఉచిత కంటి వైద్యశిబిరంలో 450 మందికి కంటిపరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరానికి 600 మంది హాజరవ్వగా వారిలో 330 మందికి ఉచితంగా కళ్లద్దాలను బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరైస్వామి స్వయంగా పంపిణీ చేశారు. మరొక 146 మందికి మందులు అందించారు. 45 మందికి అంతర కుసుమాలున్నట్లు గుర్తించి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు మజ్జిగ, పలహారాలు, మధ్యాహ్న భోజనం సమకూర్చారు.

300 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో పెద్ద బజార్ వీధిలో ఆదివారం విఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు, ఆధ్వర్యంలో టిడిపి టౌన్ అధ్యక్షులు దొండా నరేష్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు శిబిరాన్ని ప్రారంభించారు. అనకాపల్లి ఉషా ప్రైమ్ హాస్పిటల్, ఘాట్ రోడ్డు డిడిఆర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని ఉచిత గుండె పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని, కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వడ్డాది పరిసర ప్రాంతాలకు చెందిన 300మంది పాల్గొని, వైద్యసేవలు పొందారు. అత్యవసర, మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారికి ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఉషా ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్ బలగా శ్రీనివాస్, ఘాట్ రోడ్డు డిడిఆర్ ఆసుపత్రి డాక్టర్ జివి.చాందిని, హెచ్‌సిజి కేన్సర్ ఆసపత్రి డాక్టర్ గుంటూరు ఇందిర, ఇతర వైద్యబృందం పాల్గొని రోగులకు సేవలు అందించారు. అనంతరం ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విఎస్ఆర్ ట్రస్ట్ చైర్మర్ డాక్టర్ వడ్డి సత్యారావును పలువురు అభినందించారు.

ఉచితంగా ఇసిజి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

- రెడ్‌క్రాస్ జిల్లా కొత్త కమిటీ ఏర్పాటులో డిఆర్‌ఒ సత్యనారాయణ

మాట్లాడుతున్న డిఆర్‌ఒ సత్యనారాయణరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : సమాజానికి అండగా నిలిచే సేవా సంస్థ రెడ్‌క్రాస్‌లోని ప్రతి సభ్యుడూ బాధ్యతగా, సేవాభావంతో నిబద్ధతతో పనిచేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన సాయాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు పిలుపు నిచ్చారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అనకాపల్లి జిల్లా కమిటీ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖపట్నం జిల్లా శాఖ చైర్మన్ సి. బాలసతీష్ ఆధ్వర్యంలో, డిఆరఒ సత్యనారాయణరావు సమక్షంలో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా డాక్టర్ గ్రంధి శేషకుమార్, వైస్‌చైర్మన్‌గా పి. సురేశ్వరరావు, కోశాధికారిగా పి.కృష్ణంరాజుఎన్నికయ్యారు. సమావేశంలో గతేడాది చేపట్టిన రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, విపత్తు సహాయక చర్యలు, యువ రెడ్‌క్రాస్ కార్యకలాపాలపై సమీక్షించారు. వచ్చేఏడాదికి చేపట్టబోయే ప్రణాళికలు, సేవా కార్యక్రమాల విస్తరణపై చర్చ జరిగింది.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

12న వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ

అనకాపల్లిలో ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణలో మలసాల భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై, భీమునిగుమ్మం, పెరుగు బజార్ జంక్షన్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయానికి వైసిపి ప్రజాఉద్యమర్యాలీ చేరుకుంటుందని, అక్కడ ఆందోళన అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. నిరసన ర్యాలీలో నియోజకవర్గంలోనిపార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, మహిళా విభాగం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, ఎంపిపి గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, ఎఎంసి మాజీ చైర్మన్ మలసాల కిషోర్, యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళి, డాక్టర్ సిద్ధార్థ, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేటి శివ, త్రినాధ్, జ్ఞానదీప్, హైమావతి, పద్మ కుమారి పాల్గొన్నారు.

సీతమ్మధార : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న నిర్వహించే వైసిపి 'ప్రజా ఉద్యమం' ర్యాలీ పోస్టర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, కెవిఎన్.శశికళ, సీనియర్ నాయకులు సతీష్ వర్మ, పేడాడ రమణికుమారి, అంబటి శైలేష్, ఎం.సునీల్‌కుమార్, కర్రి రామారెడ్డి, తుళ్లి చంద్రశేఖర్, రమ పాల్గొన్నారు.

సీతమ్మధారలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెకె.రాజు

ఆనందపురం : విద్య, వైద్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలకు దూరం చేస్తోందని వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో కుమార్తె సిరి సహస్ర, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఈ నెల 12న నిర్వహించే ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భీమిలి నియోజకవర్గంలోని తగరపువలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుండి భీమిలి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఈ నెల 12న బైక్ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పంట నష్టాలు నమోదు చేయించాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, గాలులకు పంట నష్టపోయిన రైతులు వాటి వివరాలను గ్రామ సచివాలయాలలో అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు సూచించారు. ప్రధానంగా తుఫాన్ కారణంగా చిరుధాన్యాలు, మిరప, వంగ, టమాటా, అరటి, బొప్పాయితోపాటు వరి పంట నష్టపోయినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అయితే రైతుల వద్దకు వ్యవసాయ అధికారులు వెళ్లి పంటలు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పంట నష్టపరిహారం కోల్పోయే అవకాశం ఉన్నందున, బాధిత రైతులే నేరుగా అధికారుల వద్దకు వెళ్లి తగు ఆధారాలతో పంటనష్టాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని కెవి పెదపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొక్కిరాపల్లి రూరల్, పెదపల్లి 24గంటలు టౌన్ ఫీడర్ పరిధిలో కొక్కిరాపల్లి, పురుషోత్తపురం పీడర్లలో నిర్వహణ, మరమ్మతు పనుల నేపథ్యంలో ఈనెల 10న సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్స్ విభాగం ఇఇ కె.రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. రేగుపాలెం, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజారోగ్య వేదిక వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే ఈ వైద్యశిబిరంలో 60 మందికి రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, మూర్ఛ తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, నామమాత్రపు రుసుముతో మందులు అందజేవారు శిబిరాన్ని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టీ కామేశ్వరరావు సందర్శించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్ సాంబమూర్తి, జనని ఆసుపత్రి వైద్యులు మీనేంద్ర కుమార్, వేప కామేశ్వరరావు, ప్రజారోగ్య వేదిక ముఖ్య నిర్వాహకులు మల్ల చంద్రశేఖర్, కొణతాల త్రినాథ్, కె.శ్రీరామ్మూర్తి, మున్సిపల్ రాజు, బుగిడి నూక అప్పారావు, కె. ప్రసన్న, రాఘవరావు, కాళ్ల తేలయ్య బాబు, ఎస్ఎఫ్ఐ వాలంటీర్లు పాల్గొన్నారు.

భువనేశ్వరికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -సబ్బవరం :మండలంలోని ఆరిపాక పంచాయతీ పెద యాతపాలెం దరి మణిపురంలో భువనేశ్వరీదేవి ఆదివాస ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జిల్లేడుపత్రితో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆదివాస మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంటాను ఆలయ కమిటీ నిర్వాహకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసారు.కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు), మండల టిడిపికార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహనా ర్యాలీ

పజాశక్తి -సబ్బవరం :మండలంలోని మొగలిపురం గ్రామంలో ఆదిత్య డిగ్రీ, పిజి కాలేజ్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ సేవాకార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా వంటి కీటక జనిత వ్యాధులపై అవగాహనకు నినాదాలతో ర్యాలీ చేశారు. కూటమి నాయకులు తమరాన బంగారు నాయుడు, తమరాన సత్యనారాయణ, అంగటి నానాజీ, మేడపాటి రాము, కోటాన దేవుడు, రాయవరపు శ్రీను పాల్గొన్నారు.

మొగలిపురంలో ర్యాలీలో పాల్గొన్న ఆదిత్య కాలేజీ విద్యార్థులు

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని సీతంపేట-కాశీపురం మార్గంలో తరచూ జరిగే రహదారి ప్రమాదాల కారణమైన రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కల తొలగింపుపై స్థానిక యువత దృష్టిపెట్టారు. ఆదివారం నాగయ్యపేట, సీతంపేట యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానంతో రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన పొదలు, తుప్పలను తొలగించారు. రోడ్డుమలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితుల్లో వాటిని శుభ్రం చేశారు. యువత శ్రమదానంతో బాగుచేసిన రహదారి గుండా కాశీపురం, నాగయ్యపేట, తామరబ్బ, చింతలపూడి గ్రామాల ప్రజలతో పాటు అనంతగిరి మండలానికి చెందిన అనంతగిరి, అరకు, ఎస్.కోట పరిసరాల గ్రామాలకు వెళ్లేవారికి ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. యువత చొరవ, సేవాభావాన్ని పలువురు అభినందించారు.

రోడ్డు కిరువైపులా బాగు చేస్తున్న యువత

కెవిడి పాఠశాల ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -వడ్డాది : సబ్బవరంలో ఇటీవలనిర్వహించిన జిల్లా స్థాయి స్కిల్ గేమ్స్ పోటీల్లో వడ్డాది కెవిడి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి, ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం ప్రసన్న కళ తెలిపారు. జిల్లాలోని 68 పాఠశాలల్లో 117 వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, ఎలక్ట్రానిక్స్ విభాగంలో వడ్డాది హైస్కూల్ విద్యార్థులు రాకేష్, భార్గవ్ రామ్, భాను, బాలు, పవన్ తయారు చేసిన ఆటోమెటిక్ సేఫ్టీ రైల్వే ప్లాట్‌ఫామ్ ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సొంతం చేసుకుందన్నారు. సర్వశిక్ష అభియాన్ ఎపిసి జయప్రకాశ్ నుంచి బహుమతి స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు ఒకేషనల్ ట్రైనర్ కె.గంగాధర్‌ను హెచ్‌ఎం ప్రసన్న కళ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు సత్తా చాటాలని ఆకాంక్షించారు.

గుంతలు లేని రహదారులను నిర్మిద్దాం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్రంలో గుంతలు లేని రహదారులను నిర్మిద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎపి రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బి మంత్రి బిసి జనార్దన్ రెడ్డి సమక్షంలో బోర్డు డైరెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని,దాన్ని సాకారం చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామన్నారు. అధికారులు, స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణంతోపాటు కొత్త రోడ్ల నిర్మాణం చేపడదామన్నారు. నూతనంగా నియమితులైన డైరెక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో ఎండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు .

సమావేశంలో పాల్గొన్న కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు

నూకాంబికను దర్శించుకున్న రైల్వే జోన్ మేనేజర్ సందీప్

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: పట్టణంలోని గవరపాలెం నూకాంబికను ఆదివారం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ ఠాగూర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అంకుష్‌గుప్తా దంపతులు దర్శించుకన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి పూర్ణకుంభంతో పాలకవర్గ సభ్యులు, దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ఛైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు) అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ కెఎల్ సుధారాణి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ , దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాస్, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోష్ కుమారి నగేష్ పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానం అర్చక ప్రముఖులు నరసింహాచార్యులు, గోపాలచార్యులు పాల్గొని నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం దిబ్బవీధి కొబ్బరితోటలో ప్రజల సమక్షంలో మరోమారు ప్రమాణస్వీకారం చేసి, పౌరసత్కారం స్వీకరించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షునిగా దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు), ఛైర్మన్‌గా ఆళ్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), కోశాధికారిగా కొణతాల త్రినాధరావుతో పాటు అనువంశిక ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ కౌన్సిలర్ పివి జగన్మోహన్రావు అధ్యక్షతన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొణతాల మురళీకృష్ణ, బిఎస్ఎంకె జోగి నాయుడు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ కె.కృష్ణమూర్తి, సీతారామ దేవస్థానం ఛైర్మన్ దాడి భాస్కరరావు, నాగేంద్ర స్వామి ఆలయ ఛైర్మన్ బి రోషన్ కుమార్, మద్దాల కృష్ణారావు, ఎల్లపు గోవింద, ఎల్లపు సత్యనారాయణ, కొణతాల వాసు, రాపేటి శ్రీనివాసరావు, కోయిలాడ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ

భక్తిశ్రద్ధలతో బండిమాంబ పండగ

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : మండలంలోని ఏటికొప్పాక గ్రామదేవత బండిమాంబ పండుగ ఆదివారం కనులవిందుగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా, క్యూలైన్లు ఏర్పాటు చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపి చలపతిరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే యూవి రమణమూర్తి రాజు, మున్సిపల్ ఛైర్మన్ పిల్లా రామకుమారి, ఎంపిపి బోదేపు గోవింద్, అన్నం వెంకటరమణ, మాజీ ఎంపిపి బోదెపు ఎర్రయ్య దొర, జెడ్‌పిటిసి సేనాపతి సంధ్యారాము, బిసి సంఘ జిల్లా ప్రెసిడెంట్ యు త్రినాధరావు, మండల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాథ్, కరణం రవి, వీసం బంగారి, దూది నరసింహమూర్తి మండల స్థాయి నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- పాయకరావుపేట : ఈనెల 14 నుండి 20 వరకూ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని లైబ్రేరియన్ వామాల లక్షణరావు (శ్రీను) తెలిపారు. ఆదివారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించారు. 14న వారోత్సవాలు ప్రారంభం, బాలల దినోత్సవం, వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 15న క్విజ్, వక్తృత్వ పోటీలు, 16న పుస్తక ప్రదర్శన, గ్రంథాలయోద్యమకారులకు నివాళులు, పద్య పఠనం పోటీలు, 17న చిత్రలేఖనం, యోగాసన పోటీలు, 18న భగవద్గీత, దేశభక్తి గీతాల పోటీలు,19న మహిళా దినోత్సవం, మహిళలకు మ్యూజికల్ ఛైర్ పోటీలు, 20న వారోత్సవాలు ముగింపు, వివిధ పోటీల్లో విజేతలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌విఎస్ ఆచార్యులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎన్‌టి సీతారామమూర్తి, వై అచ్యుతరావు, తాళ్ళరావు, ఎస్ సీతారామమూర్తి, డి పాపారావు, తేజోమూర్తుల వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల కార్యాలయాల వద్ద నేడు టిడిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం ఈనెల 10న సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎపి ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తల సమస్యలు, సమకాలీన రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించనున్నారు. అనంతరం తహశీల్దార్, మండలపరిషత్, పోలీస్‌స్టేషన్ల వద్ద గండిబాబ్జి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించ నున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొని, పార్టీ సమావేశంతోపాటు గ్రీవెన్స్‌లో భాగస్వామ్యం కావాలని టిడిపి శ్రేణులు కోరారు.

గ్రామజ్యోతి యువత శ్రమదానం

ప్రజాశక్తి - యలమంచిలి :మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వార్డులో గ్రామజ్యోతి సభ్యులు ఆదివారం ఉదయం శ్రమదానం చేశారు. ప్రధాన వీధిలో ఆర్‌కె లేఅవుట్ పసుపులేటి పాకల వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పల్ని , ప్లాస్టిక్ వ్యర్థాల్ని తొలగించారు. తమకు అన్ని రకాలా అండగా నిలుస్తున్న కౌన్సిలర్ మజ్జి రామకృష్ణకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి ఆదివారం ఒక గంటసేపు శ్రమదానంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గ్రామజ్యోతి యువతను స్థానికులు అభినందించారు. పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణకు యువత చేస్తున్న సేవా కార్యక్రమాల గ్రామ పెద్దలు కర్రి కొండలరావు, రాయుడు అభినందించారు. భవిష్యత్తులో గుడి, బడి ప్రాంగణాలు బాగుచేస్తామని గ్రామజ్యోతి యువత వెల్లడించారు.

ప్రేమసమాజం పిల్లలకు అన్నసమారాధన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం చోడవరం ప్రేమ సమాజంలోని 60 మంది పిల్లలకు భోజనాలు సమాకూర్చారు కార్యక్రమంలో పి. సత్యనారాయణ పాల్గొన్నారు. పిల్లలకు భోజనాలతో పాటు పండ్లు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా రహదారి బెర్మ్‌లు

▸▸వర్షాలకు బురదమయం ▸▸స్కిడ్ అవుతున్న వాహనాలు

మునబాలవానిపాలెం వద్ద బురదగా ఉన్న బెర్మ్

ప్రజాశక్తి -నక్కపల్లి:జాతీయ రహదారి అంచున ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుకు ఇరువైపులా వేసిన బెర్మ్‌లు నాణ్యత లోపించడంతో గోతులు పడ్డాయి. వర్షం వచ్చినప్పుడు బురదమయంగా బెర్మ్‌లు దర్శనమిస్తున్నాయి. అయినప్పటికి హైవే అథారిటీ వారు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పాయకరావుపేట నుండి నక్కపల్లి వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ రోడ్డుపై నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నిత్యం ఈ రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపిస్తుంది. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేసి నాణ్యతగా బెర్మ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే వేసిన బెర్మ్‌లు నాణ్యత లేకపోవడంతో జాతీయ రహదారిని అనుకొని పలుచోట్ల పెద్దపెద్ద గోతులు పడ్డాయి. కొన్నిచోట్ల బురద మయంగాను మారింది. దీంతో, ప్రమాదాలకు నిలయమైంది. జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో ఓవర్ టేక్ చేసే సమయంలో ఒక్కొక్కసారి రోడ్డుకు ఆనుకుని ఉన్న బెర్మ్‌ల గుండా వాహనాలు వెళ్తుంటాయి. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జీబ్రా లైన్ మార్గంలో రాకపోకలు సాగించేటప్పుడు పెద్దపెద్ద వాహనాలు ఓవర్ టేక్ చేసే సమయంలో బెర్మ్‌లు ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగించే లారీ డ్రైవర్లు కాస్త సేద తీరేందుకు కూడా వాహనాలను రోడ్ల పక్కన (బెర్మ్‌లు) నిలుపుదల చేస్తుంటారు. పలుచోట్ల బెర్మ్‌లు సక్రమంగా లేని కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని మన బాలవానిపాలెం, వెదుళ్లపాలెం, కాగిత, టోల్ గేట్, ఉద్దండపురం,

ఉద్దండపురం వద్ద జీబ్రా లైన్ వరకు మట్టి

వెదుళ్లపాలెం వద్ద బురదగా ఉన్న బెర్మ్

ఒడ్డిమెట్ట ప్రాంతాల్లో పలుచోట్ల ఎర్త్ బెర్మ్‌లు అధ్వానంగా ఉన్నాయి. పలు చోట్ల జీబ్రా లైన్ వరకు కూడా మట్టి కమ్మి ఉంది. దీంతో, ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవ్వడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షం వచ్చినప్పుడు లారీలను రోడ్డుకు ఆనుకుని ఉన్న బెర్మ్‌ల పై నిలుపుదల చేయడంతో బురదమయంగా ఉన్నాయి. జాతీయ రహదారిని అనుకుని పలుచోట్ల బెర్మ్‌లు అధ్వానంగా ఉన్నందున ప్రమాదాలకు నిలయంగా మారినా హైవే అథారిటీ వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ చూసి చూడనట్లు ఉండటం సరైన పద్ధతి కాదని, అధికారులు స్పందించి వెంటనే నాణ్యతతో కూడిన ఎర్త్ బెర్మ్‌ల నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ తగదు

రోలుగుంటలో సంతకాలు సేకరణ చేపడుతున్న అమర్

ప్రజాశక్తి -నర్సీపట్నం:కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆదివారం పాత లక్ష్మీపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ లో భాగంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు వివిధ మండలాల ప్రజలకు ఉపయోగపడే మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేయడంతో పాటు ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందాలనే ఉద్దేశంతో 630 పడకల ఆసుపత్రి వైసీపీ ప్రభుత్వం నిర్మించ తలపడితే కూటమి ప్రభుత్వం వైద్యంతో వ్యాపారం చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల అధ్యక్షుడు సేనాపతి వెంకటరత్నం, లక్ష్మీపురం సర్పంచ్ నాగేశ్వరరావు, సోమేష్ పాల్గొన్నారు.

రోలుగుంట:ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నం ఓ దుర్మార్గ విధానమని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆదివారం రోలుగుంటలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విజన్‌లో భాగంగా స్థాపించబడిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలతో పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. అలాంటి వీటిని ప్రైవేటు వర్గాలకు అప్పగించాలని ప్రభుత్వం దురాలోచన చేస్తోందన్నారు. ఒక్క మెడికల్ కళాశాల కూడా తీసుకురాలేని చంద్రబాబు నాయుడు, ఇప్పుడు జగనన్న వేసిన బాటను అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల రమణమ్మ, సీనియర్ నాయకులు యర్రంశెట్టి రాజారావు, టివి.రమణ, మడ్డు అప్పలనాయుడు, పోతల రాజశేఖర్, శెట్టి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రభుత్వవైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని నియోజవర్గ వైసిపి ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని మొగిలిపురం గ్రామంలో వైసిపి నేత గండి రవికుమార్ ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ చేపట్టారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, ఉపాధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడి బాబు, సర్పంచులు బోను గంగనాయుడు, బండారు శ్రీను, ఎంపిటిసి గొర్లి నూకరాజు, ఎర్రా శ్రీను, గవర రాజు, సిరపరపు వాసుపాల్గొన్నారు.



సంతకాల సేకరణలో అదీప్‌రాజ్, రవికుమార్

అపారిశుధ్యానికి కేరాఫ్ ధర్మసాగరం చెరువు

-పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి -నర్సీపట్నం:మండలంలో ధర్మసాగరం గ్రామానికి చెందిన సువిశాల చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో గల పెద్ద చెరువు సమీపంలో అపారిశుద్ధ్యం తాండవిస్తుంది. ఈ గ్రామంలో చెరువుల నుండి లభించే చేపలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు ప్రత్యేకంగా మత్స్యకారులు ఈ చెరువును చేపల పంటకు కొనుగోలు చేస్తూ ఉంటారు. గ్రామంలో దాదాపు పది వరకు చెరువులు ఉన్నాయి. దాదాపుగా ఏటా లక్షల్లో ఈ చెరువుల నుంచి ఆదాయం లభిస్తూ ఉంటుంది. హానికారిక వ్యర్థాలను చెరువుల్లో విసర్జించకుండా చర్యలు చేపడుతున్నప్పటికీ ఈ పెద్ద చెరువు సమీపంలోనే గ్రామానికి చెందిన ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు డంపింగ్ యార్డుగా ఉపయోగించడంతో కలుషితం అవుతోందని గ్రామస్తులు ఆరోపించారు. చెరువు సమీపంలో గల శ్మశాన వాటికకు ఎదురుగా డంపింగ్ యార్డ్ మాదిరిగా చెత్తను వేయడంతోరుద్ర భూమికి వచ్చే గ్రామస్తులు ఇబ్బందిగా ఉంది. కొన్ని సందర్భాల్లో దుర్గంధం వెదజల్లుతుందని పలువురు తెలిపారు.చెరువుకు వెళ్లే రహదారికి ఇరువైపులా కూడా చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం సైతం వెదజల్లుతోందని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్తా చెదారం

చదివిస్తున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -నర్సీపట్నం: గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం మాకెంతో ఇష్టమని నర్సీపట్నం గ్రంథాలయ శాఖ పరిధిలో విద్యార్థులు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో గ్రంధాలయ అధికారిని దమయంతి పిల్లల కోసం వచ్చిన కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను చదివించారు. ఈనెల 14 నుంచి జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలకు విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలని, వివిధ పోటీలు నిర్వహిస్తామని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఇంగ్లీష్ అక్షరమాలలో పజిల్ గేమ్స్ నిర్వహించారు.

హాజరైన బాల బాలికలు

ఉత్సాహంగా బాలల వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: పిఆర్‌టియు ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల దినోత్సవ వేడుకలు నర్సీపట్నంలో ఉత్సాహంగా కొనసాగాయి. ఇందులో భాగంగా ఆదివారం హిందీ భాష ప్రాముఖ్యత పై విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ, హిందీ భాషపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు, ఏడు మండలాలకు సంబంధించి సుమారు 248 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోట ప్రసాద్, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు హైడ్రోపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి:మండల కేంద్రంలోని స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద హైడ్రో వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 10న నిర్వహించడం జరుగుతుందని. హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్లు సివేరి కొండలరావు, వంతల బుద్రయ్యలు తెలిపారు. వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని నవయుగ కంపెనీలతో కుమ్మకై హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. దీనిపై భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించేందుకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి టోకూరు పంచాయతీ చిట్టంపాడు, గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి, పెద్దకోట పంచాయతీ రేగులపల్లెం, పెద్దకోట, చింతపాక గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఆదివాసి గిరిజన సంఘం. ఉద్యోగుల సంఘాలు, పార్టీలు హాజరు కావాలని కోరారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

మెకానిక్‌లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం:మెకానికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు.వరసిద్ధి వినాయక మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఏ రంగంలోనైనా మెకానికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. అటువంటి రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి సూరిబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అందని జిఎస్‌టి ఫలాలు..

-ప్రకటనలకే పరిమితం..

ప్రజాశక్తి -నర్సీపట్నం:నర్సీపట్నం డివిజన్, మున్సిపాలిటీ నగరం, ఏజెన్సీ ముఖద్వారం నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిపోయే వారితో రద్దీగా ఉండే ప్రాంతం. ఇటీవల సెప్టెంబర్ 20 నుండి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు అంటూ ప్రచారం మాత్రం మిన్నంటింది. సుమారు 40 రోజులు పూర్తి కావస్తున్నా నేటికి ఎక్కడా జిఎస్టి ఫలాలు సామాన్యులకు అందిన దాఖలాలు కనిపించడం లేదు.

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీ పునర్విభజనతో పేద మధ్యతరగతి, సామాన్య ప్రజలకు లబ్ధి చేకూర్చుందని, అన్ని రకాల వస్తువులు తగ్గుముఖం పట్టాయని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకోవడంతో పాటు సూపర్ సేవింగ్ పేరుతో అధికారులతో పాటు నాయకులు ప్రచారం చేసుకున్నారు. జిఎస్టి అమలు కాకముందు వినియోగదారులకు ఏ ధరకైతే వస్తువులు లభించేవో ఇప్పుడు కూడా అదే ధరకు లభిస్తున్నాయని కొత్త ధరలు రాలేదంటూ దుకాణం యజమానులు చెప్పడంతో వినియోగదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నర్సీపట్నం పరిసర ప్రాంత వాసులకు జిఎస్టితో ఒనగూరిందేమీ లేదని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వస్తువులు, నిత్యావసర సరుకులు సైతం ఇటీవల అమాంతంగా పెరిగి పోవడంతో వినియోగదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గృహోపకరణాలు సైతం తగ్గక పోవడంతో సూపర్ సేవింగ్ ఎవరి కోసమంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. కార్లు, మోటార్ బైకులు మాత్రం కాస్త ఊరట లభించింది. జీఎస్టీ కి ముందు తరువాత అంటూ ప్రచారమే కానీ దుకాణాల వద్ద ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహోపయోగ, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గే విధంగా చర్యలు చేపట్టాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ కంచాలతో కాఫీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -పాడేరు:పెరిగిన కూలి రేటు ప్రకారం తమకు వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మెలో భాగంగా ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు మినుములూరు కాఫీ ఎస్టేట్ వద్ద ఆదివారం ఖాళీ కంచాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సుందర్రావు, హెల్పర్లు కాంతమ్మ సత్యనారాయణ, రాంబాబు, మంగమ్మ, లక్ష్మి దేవి చిన్నాలమ్మ, వరలక్ష్మి, కాఫీ కార్మికులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ ఏర్పాటుతో ఉనికికే ప్రమాదం

ప్రజాశక్తి-నక్కపల్లి:తరతరాలుగా సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం...చేపలు వేట తప్ప ఏ వృత్తి చేతకాదు.. తమ జీవన విధానాన్ని, ఉనికిని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్క్ ను రద్దు చేసి ప్రాణ భిక్ష పెట్టాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు ఆదివారం నాటికి 57 వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలని కోరుతూ మత్స్యకారులు రెండు చేతులు చాచి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా సముద్రం కలుషితమై చేపల ఉత్పత్తి తగ్గిపోవడంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవన ఉపాధికి, ఉనికికి ప్రమాదం

ప్రభుత్వానికి మత్స్యకారుల వేడుకోలు

వాటిల్లుతుందన్న భయంతో మత్స్యకారులు 57 రోజుల నుండి చేపలు వేటకు వెళ్లకుండా బల్క్ డ్రగ్ పై పోరుబాటను కొనసాగిస్తున్నారు. పోలీసులు అనేక ఆంక్షలు పెట్టినప్పటికీ మత్స్యకారులు భయపడకుండా బల్క్ డ్రగ్ రద్దు చేయాలని ఒకే ఒక డిమాండ్‌తో ముందుకు సాగుతున్నారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గోసల కాసులమ్మ, ఎంపిటిసి సభ్యులు పి.సత్తయ్య, మత్స్యకార నాయకులు ఎం.మహేష్ బాబు, జి సోమేశ్వరరావు, పి.పైడితల్లి, పి.రాంబాబు, సిహెచ్ కాశి, పి.సత్తయ్య, పి.నల్ల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బెయిల్

మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, పిక్కి కోటి (రామ్ చరణ్) లకు బెయిల్ రావడంతో ఆదివారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు రాజయ్యపేట వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి, మద్దతునిచ్చారు.మత్స్యకారులు చేస్తున్న న్యాయపోరాటానికి అండగా నిలుస్తామన్నారు.

నిరసన చేపడుతున్న మత్స్యకారులు

రోడ్డు బాగుపడేనా...?

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని రొంగల పాలెం పంచాయతీ శివారు గ్రామమైన కాముడిపాలెం నుండి నర్సీపట్నం మండలం చెట్టుపల్లి వెళ్లే రోడ్డు నిర్మాణంనకు గత ఆరేళ్లగా ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడమే గానీ అమలుకు నోచుకోలేదని కాముడుపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 2006 సంవత్సరంలో జానకిరాంపురం నుండి కాముడి పాలెం మీదుగా చెట్టుపల్లి వెళ్లుటకు మెటల్ రోడ్డు వేయడం జరిగిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టక పోవడంతో రాళ్లు పైకి తేలిపోయి గోతులమయంగా ఉందని ప్రయాణం చేయుటకు నరకయాతన పడుతున్నామన్నారు. మండల కార్యాలయానికి వెళ్లాలన్నా నర్సీపట్నం చేరుకోవాలన్నా తమకు ఇదే రోడ్డు ప్రధానమైంది. ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలపైన ప్రయాణిస్తే తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎన్నికల ముందు 2019లో హామీ ఇచ్చారని, ఐదేళ్ల తమ గ్రామానికే రాలేదని వాపోయారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా మా రోడ్డుకు నిధులు మంజూరులో జాప్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

రాళ్లు తేలిన రహదారి

రోడ్డు నిర్మించాలి

గత ఐదేళ్లగా వార్డు మెంబర్‌గా ఉన్నాను. ఈ రోడ్డుపై గత ఎమ్మెల్యే హామీ ఇచ్చి కనీసం గ్రామానికే రాలేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలి

పెంటకోట అప్పారావు, వార్డు మెంబర్

హామీ నెరవేరలేదు

మాజీ ఎమ్మెల్యే ఈ రోడ్డు నిర్మాణంనకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కొబ్బరికాయ కొట్టి పూజ చేయడం జరిగింది. కానీ గడిచిన ఐదేళ్ల హామీ నెరవేలేదు.

రాపేటి వెంకటరమణ, గ్రామస్తుడు

వెంటాడుతున్న రేబిస్ భయం

- గుబులు పుట్టిస్తున్న కుక్కకాటు మరణాలు
- సుప్రీంకోర్టు ఆంక్షల అమలు బలాదూర్
- శునక ప్రియుల్లోనూ తప్పని ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఇటీవల కాలంలో రేబిస్ భయం గుబులు పుట్టిస్తోంది. ఒకవైపు వీధికుక్కల వ్యవహారాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకుని, ఆంక్షలు విధించగా, కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాలకు నిర్దేశించగా, మరోవైపు ఆ నోటా, ఈ నోటా సమాచారంతోపాటు సామాజిక మాధ్యమాల్లో రేబిస్ సోకి పలువురు మృత్యువాత పడిన ఘటనలు వైరల్ కావడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. అయినాస్థానిక సంస్థలుగానీ, అధికారులు, ప్రభుత్వాలు గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా ఆందోళన , ఆవేదన వ్యక్తమౌతోంది.

వీధుల్లో ఎక్కడబడితే అక్కడ కుక్కలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల అటుగా వచ్చిపోయే వారిపై దాడులు చేసిన ఘటనలూ ఉన్నాయి.. దీంతో ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతుంది. కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి సోకితే, దాన్ని అరికట్టడానికి మందులు లేవని, ఎటువంటి వ్యాక్సిన్లు పనిచేయవని చివరకు నానా అవస్థలు పడుతూ ప్రాణాలు కోల్పోవడమొక్కటే మార్గమని వైద్యనిపుణులు హెచ్చరికలు ప్రజల్లో ఆందోళనకు కారణమని వేరే చెప్పనక్కరలేదు. వీధికుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలకు ఉన్నప్పటికీ, అవి పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి, వీటి వృద్ధిని నియంత్రించడానికి ఒకప్పుడు కుక్కలను పట్టుకుని కుటుంబనియంత్రణ చేసేవారు. కానీ ఇపుడా పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో వీధి కుక్కలు విపరీతంగా పెరుగుతున్నాయనే చెప్పాలి.. అదే సమయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా వాటి పెంపకందారులు యాంటీ రాబీస్ టీకాలు వేస్తున్నా, వీధి కుక్కలను పట్టించుకునే దిక్కులేదు. ఇలాంటి పరిస్థితులో వీధికుక్క కాటుకు గురైన మనుష్యులకు ఎఆర్‌వి సరిపడా నిల్వలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేవనే అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కుక్కకాటు బాధితులు ప్రయివేటును ఆశ్రయించి వ్యాక్సినేషన్ చేయించుకోక తప్పని పరిస్థితి. దీనిపై అవగాహన, ఆర్థికస్తోమత లేని వారు. ఇంకా ఏమౌతుందని నిర్లక్ష్యం వహించేవారు రేబిస్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందనే చెప్పాలి. ఇటీవల చోటుచేసుకుంటున్న పలు మరణాలు ఈ కోవలోకి వస్తాయని చెప్పక తప్పదు.

విశ్వాసానికి మారు పేరుగా భావించే కుక్కలను పెంచడం, వాటిని కుటుంబసభ్యుల్లో ఒకరిగా చూడడం ఎందరికో అలవాటు. అదే ఇపుడు వారి ప్రాణాల మీదకు తెస్తోందని పలువురు హెచ్చరిస్తున్నారు. వాటికి వ్యాక్సిన్ వేసినా, వాటి వల్ల ప్రమాదం తొలగిపోలేదని అంటున్నారు.

వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్క కరిస్తేనే కాదు, మనిషి శరీర గాయాలపై కుక్క నాకినా వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంపుడు కుక్కలైనా వాటికి కాస్తంత దూరంగా ఉండడమే మేలని అంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

కుక్కలకు ఏటా విధిగా వ్యాక్సినేషన్ చేయించాలి. కుక్కల ప్రవర్తన గమనించాలి. అవి అధికంగా ఉలిక్కిపడడం, నీళ్లను చూడగానే భయపడడం, దురుసుగా ప్రవర్తించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వెటర్నరీ డాక్టర్‌ను సంప్రదించాలి. పిల్లలకు అవగాహన కల్పించాలి . ఎటువంటి కుక్కలతోనైనా ఆటలాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఒక్కసారైనా కాటుతో బాధపడితే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలి. కుక్కకాటుకు గురైన వెంటనే సబ్బుతోకనీసం 15 నిమిషాలు కడిగి, వెంటనే ఆసుపత్రికి వెళ్లి, తగు వైద్యం, వ్యాక్సినేషన్ చేయించుకోవడం తప్పనిసరని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

గాంధీనగరంలో ఉత్సాహంగా హ్యాపీ సండే

ప్రజాశక్తి - యలమంచిలి : పాఠశాలకు, పుస్తకాలకు, టీవీలకు, మొబైళ్లకు దూరంగా ఆదివారాలు పిల్లలు మరింత హాపీగా గడపడమే లక్ష్యంగా 'హాపీ సండే' కార్యక్రమం ప్రతివారం ఒక్కో వార్డులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి వివరించారు. ఆదివారం గాంధీనగరం స్టేషన్‌రోడ్డులో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుతో కలిసి 'హాపీ సండే' కార్యక్రమంలో పాల్గొని, పిల్లలతో ఆనందంగా గడిపారు. విద్యార్థులు సైక్లింగ్, యోగా, డాన్స్, మ్యూజిక్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని హితవు పలికారు. పిల్లలందరికీ బహుమతులు, యోగ్యతా పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులందిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి